# అనధికారం

గెస్ట్‌హవుస్ ఎయిర్‌కండిషన్డ్ గది. ఆ సాయంత్రం సుధారాణికి యేమాత్రం సుఖంగాలేదు. ఫోంబెడ్ మీద అసహనంగా కదిలింది. చుట్టూ, పక్కన పడవేసిన సచిత్ర పత్రికలు పెళ పెళ మన్నాయి. విసుగ్గా లేచి కాసేపు డ్రెస్సింగ్ మిర్రర్ ముందు నిలుచుని మెడలో ముత్యాలదండతో ఆడుకుంది. యేదో జ్ఞాపకం వచ్చినట్లు ఫోంబెడ్ మీదున్న ఫిల్మ్‌ఫేర్ తీసుకొని పేజీలు తిప్పింది.

చిత్ర ప్రపంచంలోని ప్రసిద్ధ సినీతార మెడలో పగడాలదండ మరీ మరీ చూస్తూ 'యిది తనకు వుండాలి, భర్త వస్తూనే చెప్పాలి' అనుకుంది. అంతలో కళ్యాణోత్సవ సందర్భంగా నిన్న తాను చూసిన వెంకటేశ్వరుని ఆభరణాలు సుధారాణికి జ్ఞాపకం వచ్చాయి. కలవరపడింది. అవి తనకు వుండాలి అనుకోవటానికి భయపడింది. అంతలో మధ్యాహ్నం రెండుగంటలకు తన్నువదలి మినిస్టరును ప్లేన్ ఎక్కించటానికి వెళ్ళి, యింకారాని భర్త సుధాకరరావు మీద సుధారాణికి కోపం వచ్చింది. ఉదయమే కర్నూలు వెళ్ళకుండా చేసిన మంత్రి మీద ఆమెకు తిక్కరేగింది.

యీ సారాయి మంత్రికి యేం కారిపోయిందో తాము తిరుపతిలో వున్నప్పుడే రాకపోతే! ఈ మంత్రులకు పనీపాటలేదు. వీళ్ళెక్కడ వాలినా, డిప్యూటీ కమీషనర్ అంతటివాడు కూడా వెంట వుండాలి. పట్టుమని నాలుగురోజులుండని ఈ మంత్రులకు పూలంగి సేవలూ, కళ్యాణోత్సవాలూ- ప్లేన్ దిగింది మొదలు కొని ఎక్కిందాకా.

సుధారాణి టైం చూసుకుంది.

హైదరాబాద్ ప్లేన్ వెళ్ళి వుంటుంది, ఈయన వచ్చేస్తుంటారు అనుకుంది. గది తలుపు లీసి బయటకు వచ్చింది. గది బయట వో మూల మాటల్లో మునిగిన కానిస్టేబుళ్ళు ఇద్దరూ అమ్మగార్ని చూసి నోరు మూసుకున్నారు. చేతులు కట్టుకొని, ఆమె ఆజ్ఞలకోసం సిద్ధంగా కొంత వంగి నిల్చున్నారు.

ఈ మినిస్టరు రాకపోతే ఇక్కడ సి.ఐ.లు వుండేవాళ్ళు. అవసరాలకు డిస్ట్రిక్ట్ సూపరింటెండెంటు వుండేవాడు. కనీసం సబ్ఇన్‌స్పెక్టరు లేడిప్పుడు.

ఆ క్షణంలో తాను మంత్రి భార్య కానందుకు సుధారాణి బాధపడింది.

యే ఆజ్ఞలూ ఇవ్వకుండా అమ్మగారు మౌనంగా గెస్ట్‌హౌస్ మెట్లు దిగి, పూలమొక్కల మధ్యకు వెళ్ళిపోతున్నందుకు కానిస్టేబుళ్ళకు ఆశ్చర్యం కలిగింది. తమ ఆశ్చర్యం బుద్బుదప్రాయమైందని వాళ్ళకు అనుభవం కాబట్టి, గెస్ట్‌హవుస్ బయటికి వచ్చి జయ విజయుల్లాగా నిల్చున్నారు. తమ అమ్మగారు యేక్షణంలోనైనా వెనక్కితిరిగి, ఆజ్ఞలు జారీచేస్తుందోననుకుంటూ సంసిద్ధంగా నిల్చున్నారు.

తిరుపతిలో అసలు వుద్యోగం కాకుండా, క్యాంపులపేరుతో యాత్రలకు పెళ్ళిళ్ళకు పెటాకులకూ వచ్చిపోయే పై అధికార్లకూ, వాళ్ళపేరు చెప్పుకొని వచ్చే బంధుమిత్రాదులకూ చేసే సేవల వుద్యోగాన్ని తిట్టుకుంటూ, తన సంసారం బాధల్ని తలపోసుకుంటూ ఒక చెట్టుకింద సిగరెట్ పీలుస్తున్న హెడ్ కానిస్టేబుల్ గంగన్న సుధారాణిని చూసునే గతుక్కుమన్నాడు. అసంకల్పంగా సిగరెట్ చేతిలోంచి జారింది. ఎటెన్షన్‌లో నిల్చునే తొందరలో చంకలమధ్య మడచిపెట్టిన పత్రిక జారి కిందపడింది.

గంగన్న అవస్థ చూసి సుధారాణికి నవ్వువచ్చింది. హోదా గుర్తుకొచ్చి నవ్వు పెదాల్లోనే యింకిపోయింది. దగ్గరకు రమ్మని చేయివూపి, వెనుదిరిగి వెళ్ళి హాల్లో సోఫాలో కూచుంది.

ఈవిడ మొగుడుకాదు డిప్యూటీ కమీషనరు, యిదే. ఇప్పుడు యే పని పురమాయిస్తుందో, యెక్కడికి తరుముతుందో? రెండురోజుల్నించి ప్రాణాలు తీస్తోంది. పల్లెలో పెద్దరెడ్ల పెండ్లాలు నయం అనుకుండూ, గంగన్న దాదాపు వురికెత్తి హాల్లో అమ్మగారిముందు నిలబడ్డాడు. అమ్మగారు చెయ్యివూపటం, గంగన్న పరు

గెత్తటం చూసిన జయ విజయు లిద్దరూ 'అదేదో అడుగుతుంది, దానికోసం కుక్కల్లాగా పరుగెత్తాలి' అనుకున్నారు.

తనముందు నిల్చున్న గంగన్నను చూసి రాణికి కర్నూల్లో తమ బంగళాల్లో, తన చుట్టూతిరిగే నల్ల కుక్కపిల్ల జ్ఞాపకానికి వచ్చింది.

"నీ దగ్గరున్న ఆ పత్రికేదీ?" అని అడిగింది.

గంగన్న పరుగెత్తికొని వెళ్ళి, చెట్టుకింద హడావుడిలో జారిపడిన వార పత్రిక తెచ్చి, అతి వినయంగా సుధారాణికి అందించి, కొంతదూరం జరిగి నిల్చున్నాడు.

"బయటనే వుండు, అయ్యగారొచ్చే టైం అయింది" అంటూ సుధారాణి నిర్లక్ష్యంగా వారపత్రిక పేజీలు తిప్పటం మొదలుపెట్టింది.

గంగన్న మనసులో బండబూతులు తిట్టుకుంటూ బయటికి వెళ్ళాడు.

వారపత్రికలో బాక్స్‌లోని 'జంతుప్రేమ' వార్త సుధారాణి కళ్ళబడింది.

ఒక ముఖ్యమంత్రిగారి కోడలు రకరకాల పక్షులు, రంగురంగుల పిట్టలు - మాట్లాడే పక్షులు, చిలకలు, మైనాలు, పూలపిట్టలు - పెంచుతున్నదనీ, ఆవిడ దగ్గరవుండే ఐరిష్ వుల్ఫ్ హవుండ్ ప్రపంచంలో అరుదైన, అపురూపమైన పెద్దకుక్క అనీ, ఆమె జంతుప్రేమ అద్వితీయమనీ వార్త!

ముఖ్యమంత్రి కోడలు జంతుప్రేమకు సుధారాణి ఈర్ష్యపడింది. తల్లడిల్లింది. అసహనంతో మండిపోయింది.

ప్రతి విషయంలోనూ మంత్రులూ, వాళ్ళ కొడుకులూ, కోడళ్ళూ, భార్యలూ, చుట్టాలూ-వీళ్ళకే పేరు ప్రఖ్యాతులు! పత్రికల్లో వాళ్ళను గురించే రాతలు! జంతుప్రేమ ముఖ్యమంత్రుల కోడళ్ళకే వున్నట్లు! అదేదో ఆ మధ్య పత్రికలో సినీతార కుక్కలప్రేమ గురించి వ్యాసం వచ్చింది. తన బంగళాలో రకరకాల కుక్కలున్నాయి. ఐరిష్ వుల్ఫ్ హవుండ్ లేకపోవచ్చు. పెంపుడు పక్షులు లేకపోవచ్చు. తాను అనుకోవాలే కానీ యెంతసేపు? అంతే.

ఐరిష్ వుల్ఫ్ హవుండ్‌ను సంపాదించి, పత్రికలో ఫోటోలు వేయించుకోవాలి అని సుధారాణి నిర్ణయించుకుంది. ఆమె అసహనం మరీ పెరిగింది.

గెస్ట్‌హౌస్ బయట కారు ఆగిన చప్పుడు వినిపించింది. సుధారాణి హాల్లోంచి లేచి తన గదిలోకి వెళ్ళి కూచుంది.

సుధాకరరావు గదిలోకి వస్తూనే ఆలస్యానికి క్షమాపణ కోరుకున్నాడు. భార్య మౌనాన్ని చూసి ప్రమాదాన్ని శంకించాడు. "రేపటి వుదయమే మన కర్నూలు ప్రయాణం," అని చెప్పి బట్టలు మార్చుకోవటానికి పూనుకున్నాడు.

సుధారాణి గోముగా, మొండిగా అంది :

"నాకు ఐరిష్ వుల్ఫ్ హవుండ్ కావాలి."

సుధాకరరావు బూటు లేసులు విప్పుకుంటూ నవ్వుతూ అన్నాడు :

"తెప్పించుకోకపోయావా? ఇక్కడ మంచి పుస్తకాల షాపులేవో వున్నట్లున్నాయి, ఇప్పుడే పంపుదాం సి.ఐ.ని యింతకూ యెవరు రాసింది ఆ నవల?"

సుధారాణికి అరికాలు మంట నెత్తికెక్కింది. 'ఈ వుద్యోగమే లేకపోతే తమ పొగాకు కంపెనీలో గుమాస్తాగా కూడా పనికిరాడు ఈ మనిషి. వుద్యోగాన్ని చూసి కుటుంబ హోదా, డబ్బూ, సంస్కారం యేం లేకపోయినా, తన తండ్రి - రెండు టుబాకో కంపెనీల యజమాని - పిల్లనిచ్చాడు. ఖర్మ' అనుకుంటూ అరిచినట్లు అంది:

"నవల కాదు. ఇట్సెరేర్ కైండ్ ఆఫ్ ప్రిస్టీజియస్ డాగ్... ఈ పత్రిక చూడండి"

భార్య విసురుగా అందించిన పత్రికలోని వార్తను సుధాకరరావు చూశాడు. ఈ పత్రికలవాళ్ళూ, ఈ దేశంలోని రాజకీయ నాయకులూ, వాళ్ళ కుటుంబాల వాళ్ళూ ఇతరుల నెత్తికి పీడ తేవటంలో అఖండులు అని విసుక్కున్నాడు. ఆ "రేర్ కైండ్ ఆఫ్ ప్రిస్టీజియస్ డాగ్ ఐరిష్ హవుండ్"ను ఎక్కడినుంచి తెప్పించాలో సుధాకరరావుకు క్షణం తోచలేదు. స్ఫురించి భార్యతో అన్నాడు :

"ఎలాగు వచ్చే నెలలో బెంగుళూరు వెళ్తాం కదా! అక్కడ ట్రై చేద్దాం,"

సుధారాణి ముఖం విప్పారింది.

"మీ సూపరింటెండెంట్‌ను పిలిపించండి" అంది.

ఆజ్ఞ అమలు జరిగింది. జిల్లా సూపరింటెండెంట్ సంకోచంగా గదిలోకి వచ్చాడు. సుధారాణి మాటల మర్యాదకు ఆయన మతిపోయింది - అంతకన్నా ఆమె కోరిక విని. "బొంబే అయినా బెంగుళూర్ అయినా గాలించి, తనకు 'ఆ హవుండ్'ను తెప్పించాలని సుధారాణి చెప్పింది. తన భార్యకున్న జంతు ప్రేమను గురించి సుధాకరరావు పదిహేను నిముషాలు సూపరింటెండెంట్‌కు వుపన్యాసమిచ్చాడు. అంతసేపూ సూపరింటెండెండ్ తల ఆడిస్తూనే వున్నాడు.

"వారం రోజుల్లో తెప్పించి పెట్టాలి. ప్రామిస్," అంది సుధారాణి.

"తప్పకుండా మేడం!" అన్నాడు జిల్లా సూపరింటెండెంట్.

"మనవాళ్ళు తల్చుకుంటే పెద్ద శ్రమ యేముందిలే", అన్నాడు సుధాకరరావు.

"యస్ సర్... వెంటనే యేర్పాటు చేస్తాను."

జిల్లా సూపరింటెండెంట్ అలా ప్రామిస్ . సి, యిలా గదిలోనుంచి బయట పడి తల విదుల్చుకున్నాడు. యమర్జెన్సీ కోరిక యిది, తీర్చక తప్పదు అనుకుంటూ తన బోడి తలను తడుముకున్నాడు.

ఐరిష్ వుల్ఫ్ హవుండ్ అస్పష్టమైన ఆకారం వెనుక బాస్ అధికారం· సుధారాణి తండ్రి పొగాకు కంపెనీలు, వాటికున్న రాజకీయ ప్రాబల్యం గుర్తు కొచ్చాయి. యింకా తనకువున్న ఐదేళ్ళ సర్వీసు బంగారుబాతు జిల్లా సూపరింటెండెంట్ మనసులో మెదిలింది. యమర్జన్సీలో తనమీద డిపార్టుమెంట్‌లో చెలరేగిన గొడవలు పైదాకావెళ్ళి ఉద్వాసన రాకముందే జాగ్రత్తపడే అవకాశం యిప్పుడు లభించింది అనుకున్నాడు. తానెప్పుడూ చూడని ఆ కుక్కకు మనసులోనే ధన్యవాదా లర్పించుకున్నాడు.

సవాలక్ష కుక్కల రకాల్లో యే కుక్కలగోలా తెలీని తాను యీ ఐరిష్ కుక్కను యే విధంగా సంపాదించటం అనే ప్రశ్న జిల్లా సూపరింటెండెంట్ మనసులో కరిగింది. మామూలు జనంతో తన్నుతాను పోల్చుకున్నందుకు తనమీద తాను విసుక్కున్నాడు.

మరుసటిరోజు డిప్యూటి కమీషనరు దంపతులు కారెక్కి వెళ్ళిపోతూనే జిల్లా సూపరింటెండెంట్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నందరినీ సమావేశపరిచాడు. వాళ్ళమీద ఐరిష్ వుల్ఫ్ హవుండ్ సంపాదనా బాధ్యత వేశాడు. పేసి బోడితల నింపాదిగా తడుముకున్నాడు.

యెవరిమటుకు వారికి డి. సి. 'అమ్మగారికి' ఆ కుక్కనేదో సంపాదించి, పువ్వుల్లో పెట్టి అందివ్వాలనే వుంది కానీ యేం రిస్కు ఉంటుందోనని వూరుకున్నారు. తమతమ వాటాలు యిస్తే తనకేం అభ్యంతరం లేదనీ, తనకు కొంత కుక్కల విజ్ఞానం తెలుసుననీ సి. ఐ. రాయుడు ముందుకు వచ్చాడు.

రాయుడు సాహసం చేసి ముందుకు రావటానికి కారణం లేకపోలేదు· ఆర్నెల్లకిందట అతను అనంతపురంలో పని చేసేటప్పుడు డి. సి. కేంప్ కొచ్చాడు. సుధారాణికి రొయ్యలు తినాలని బుద్ధి పుట్టింది. ఆమెకు రొయ్యలంటే అమిత యిష్టం. మనసులో రొయ్యమీసం కనపడాలని ఉండదు, కానీ టేబుల్‌మీద జింజర్ ప్రాన్ ఉండి తీరాలంటుంది. అనంతపురంలో ఆ రోజు పచ్చి రొయ్యలు దొరకలేదు. బెంగుళూరుకు రాయుడే స్వయంగా వెళ్ళాడు. ఖర్మకొద్దీ అక్కడా దొరక్కపోతే, కొచ్చిన్ ట్రంకాల్‌చేసి, ప్లేన్లో బెంగుళూరుకు తెప్పించి, సమయానికి కారులో పెనకచెర్ల డామ్ గెస్టుహవుస్‌కు చేర్చి, స్వయంగా వడ్డించి పొగడ్తలు పొందిన ఘనత రాయునికే వుంది. ఆ ట్రిప్పులో రిస్కు తీసుకోబట్టే రాయునికి పనిలో పనిగా కొంత డబ్బు మిగిలింది. డి. సి. దగ్గర మంచి పేరుంది. ఆ పేరును పెంచి పోషించుకోటానికి, చేస్తున్న సర్వవ్యాపారాల రక్షణకూ యిదే ఒక మంచి సమయమని రాయుడు ముందుకు వచ్చాడు.

ఐరిష్ వుల్ఫ్ హవుండ్ కొనుగోలు నిధి సేకరణ జిల్లా అంతటా జరిగింది. యే కేంద్రంలో యెంతెంత వసూలైందో వసూలు చేసిన వాళ్ళకు తప్ప తెలియదు కానీ రాయుని దగ్గరకు పదిపన్నెండు వేలు నలువైపులనుంచీ అందాయి.

యింత పెద్దయెత్తున డి. సి. వ్యవహారం పెట్టుకున్నప్పుడు గంగిగోవు లాంటి వాడెవడో తన కింద పడివుండేవాడు వుండటం మంచిదని రాయుడు గంగన్నను తనవెంట బెంగుళూరు తీసుకు పెళ్ళేందుకు నిశ్చయించుకున్నాడు. కుప్పంలోని కాంట్రాక్టరు ఓ కారును, మరో సి. ఐ. ఏర్పాటు చేశాడు.

బెంగుళూరులో ఐరిష్ వుల్ఫ్ హవుండ్ అన్వేషణ జరిగింది. తొమ్మిదవ రోజున వారం రోజుల్లో దేశం వదిలిపోతున్న ఒక విదేశీయుని దగ్గర ఐరిష్ వుల్ఫ్ హవుండ్ వున్నట్లు నాయుడు సమాచారం రాబట్టగలిగాడు.

ఆ విదేశీయుడు రెండు మూడు గంటల పాటు ఆ మేలుజాతి కుక్కను తానెంత ఆత్మీయంగా పెంచిందీ, అదెంత సాత్వికమైందీ, దాన్నెంత జాగ్రత్తగా పెంచవలసిందీ, భారతదేశంలో ఆ రకం యెంత అపురూపమైందీ చెప్పికానీ అమ్మలేదు.

ఐరిష్ వుల్ఫ్ హవుండ్‌ను సంపాదించినప్పుడు రాయుడు పొందిన ఆనందం అంతా యింతాకాదు. ఆ రాత్రి గానిగలోదే గంపెడని వసూళ్ళ మొత్తంలో స్వంత ఆనందానికి వెయ్యిరూపాయలు ఖర్చు పెట్టుకున్నాడు. జల్సా చేసుకొమ్మని గంగన్న చేతిలో ఒక వంద వుంచాడు.

ఈ తంతు అంతాచూసి గంగన్న కళ్ళకు బైర్లు కమ్మాయి. ఈ కుక్క ఖర్చుతో పెళ్ళికాని తన చెల్లెండ్లు నలుగురిలో ఇద్దరికి పెళ్ళి అయివుండేది అను కున్నాడు. కానీ ఆ కుక్క ఖర్చుకోసరం ఆశిస్తున్న తన బతుకు మీద మొదటి సారిగా రోత కలిగింది.

కారులో రాజలాంఛనాలతో ఐరిష్ వుల్ఫ్ హవుండ్‌ను రాయుడు, గంగన్న కర్నూలుకు తెచ్చారు. డి. సి. స్వంత యింటి కాంపౌండ్ ముందు కారు ఆపి, కుక్కను వెంటబెట్టుకొని కాంపౌండులో ప్రవేశించారు. వుంటే ఇటువంటి బంగళాలో వుండాలి అనుకున్నాడు రాయుడు. రకరకాల పూలమొక్కలకు నీళ్ళుపోస్తున్న కాకి నిక్కర్లను చూసి మనబతుకింతే అనుకున్నాడు గంగన్న. తోటమధ్యలో తిరుగుతున్న సుధారాణి కుక్కతో వస్తున్న రాజభటులను చూసింది. కొన్ని క్షణాలు వాళ్ళవెంటవున్న కుక్కపై ఆమె చూపులు పడ్డాయి.

రెండున్నర అడుగుల పైననే ఎత్తుంది. శరీరమంతా నల్లటి కంబళి కప్పు కున్నట్లు చిక్కటి బొచ్చుతో కురవ పొట్టేలులాగా వున్న ఆ ఐరిష్ వుల్ఫ్ హవుండ్‌ను సుధారాణి చూసి 'బ్లీస్టి నేస్టి ఎనిమల్' అని చీదరించుకుంది, చిర చిరలాడుతూ చుట్టూ చూస్తూ.

"రేయ్ అమీర్! పుల్లన్నా! యెక్కడ చచ్చార్రా?" అంటూ కోపంతో వణికిపోతూ అరిచింది.

ప్యూన్లు, కానిస్టేబుళ్ళు నలుగురైదుగురు భయంతో పరుగెత్తుకొని వచ్చారు.

"వీళ్ళను లోపలికి రానిచ్చిందెవరు? రాస్కెల్స్! బుద్ధి లేదు ఒక్కొక్కడికి, ఒళ్ళు కొవ్వెక్కింది, తేరగా గవర్నమెంటు సొమ్ము తిని. ఆ గేటుదగ్గర సుబ్బన్న గాడేమయ్యాడు? డిస్మిస్ చెయ్యాలి వాణ్ణి."

–సుధారాణి ఇంగ్లీషులో తెలుగులో తిట్లకు అంకించుకుంది.

సుధారాణి అవతారం చూసి రాయుడు బెదిరిపోయాడు, తానే స్వయంగా రొయ్యలు వడ్డించిన సంఘటన గుర్తుకు తెచ్చుకుంటూ, కొంత ధైర్యం చేసుకొని, నీళ్ళునములుతూ చెప్పాడు :

"మేడం...నేను...మీ కోసం...కారులో..."

"వ్హాట్ నాన్సెన్స్ డూయూ స్పీక్? యెవడైతేనేం నువ్వు? ముందా బాస్టర్డ్ డాగ్‌ని బయటికి తీసుకవెళ్ళు. ఐ కాంట్ స్టాండ్ యిట్ ఫర్ ఎ మినిట్ ... అట్లా చూస్తావేం?..."

రాయునికి వొళ్ళంతా జెర్రులు పాకినట్లుంది–ప్యూన్లు, కానిస్టేబుళ్ళ ముందు యెంత డి.సి. భార్య అయినా అడది తన్ను తిట్టటమా అని. వుద్యోగం గుర్తుకొచ్చి నోరుమూసుకుని పద అన్నాడు గంగన్నతో.

వెంట వచ్చిన డి. సి. గారి కానిస్టేబుల్‌ను అడిగాడు– 'అమ్మగారి యిష్టం మీదనే నానాఅవస్థలుపడి పది వేలు ఖర్చుపెట్టి తెచ్చిన ఈ కుక్కను చూసి అమ్మగారికి ఎందుకంత కోపం వచ్చిందీ?' అని...

కానిస్టేబుల్ కిసుక్కున నవ్వుతూ చెప్పాడు :

"నాకూ అదే తెల్దు. యెవరో చెప్పుకుంటుంటే విన్నా. కుక్కలవల్ల యేవో రోగాలొస్తాయని యీ మధ్య అమ్మగారెక్కడో చదివినారంట. అందుకే వారం కిందట కుక్కలన్నీ అమ్మేసింది–మన స్టాఫ్‌కే. అయినా బంగళానిండా కుక్కలున్నప్పుడు మాత్రం వాటి ఆలనాపాలనా చూసిందా ఏం? వాటితో మా దుంప తెగింది. మా పిల్లల్నికూడా వాటిని సాకినట్లు సాకలేదు. యిప్పుడు కాసా హాయిగా వుంది. మొన్న అదెవరో స్వామి వచ్చి వెళ్ళినప్పట్నుంచీ యిప్పుడెంతసేపూ పుస్తకాలూ, పూలచెట్లూ లేదా అదేందో టి.యం. అంటనే అది ..."

"ముందు ముందు మరొకపిచ్చి యెత్తుకోదని గ్యారంటీ యేముంది? అప్పుడు మళ్ళా అందరికీ కుక్కచావులే..."

జోక్యం కలుగజేసుకున్న యువకుడ్ని రాయుడు, గంగన్న వింతగా చూశారు.

"ఒరే నువ్వా సుబ్బన్నా? అంతా విన్నావా? వినుంటావులే. గేటు దగ్గర లేవని అమ్మగారు మండి పడతాంది, నీ ఖర్మ దగ్గరకొచ్చింది."

"అంతేకదా, డిస్మిస్ చేయిస్తుంది. యింతకంటె చెడిపోయేదేముంది ?" సుబ్బన్న నిబ్బరాన్ని చూసి గంగన్న ముఖ్యంగా ఆశ్చర్యపోయాడు.

రాయున్ని కానిస్టేబుల్ అడిగాడు :

"సార్! ఒక యాభై యిచ్చిపోండి సార్! చాలా యిబ్బందిగా వుంది. ఆ కుక్క ఖర్చులోదే...

రాయుడు యాభైతీసి యాంత్రికంగా యిస్తూంటే సుబ్బన్న "ఆ కుక్క గతుకే" అన్నాడు.

"పోరా! పిల్ల ముండా కొడుక్కి నీకేంతెలుసు? సార్, కారు ఎక్కండి. వస్తాను సార్! ఒరే సుబ్బన్నా, నువ్వింక యింటికి పోవచ్చు, యీ పొద్దుతో..." కానిస్టేబుల్ నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయాడు.

కారులో కూచుని సూపరింటెండెంట్ ముఖతః అప్పగించిన పని బెడిసి కొట్టినందుకూ విచారిస్తూ. యీ కుక్కనేం చేయటమా అని రాయుడు ఆలోచనలో పడ్డాడు.

గంగన్న గొణిగినట్లు అన్నాడు:

"అమ్మగారి లాంటోళ్ళు-వీళ్ళెందు-కిట్లా వుంటారో!?"

"పైవాడు చెప్పినట్లల్లా ఆడేవాళ్ళున్నంతవరకూ...రేచుకుక్కల్లా వెంటబడి జనం తరుముకోనంత వరకూ ఈ పిల్లాటలే అమ్మలదీ, అయ్యలదీ, వాళ్ళ పిల్లలదీ, బంధువులదీ కూడా..."

—సుబ్బన్న తుపుక్కున బీడీ నోట్లోంచి వూసి అన్నాడు.

యింకో సమయంలో అయితే రాయుడు అట్లా అన్న మనిషిని బూటు కాళ్ళతో తన్ని వుండేవాడే. కానీ యేమీ అనకుండా కారుడ్రైవరుతో "పోనీ" అన్నాడు నీరసంగా.

ఈ సుబ్బన్నకు సాహసం ఎక్కణ్ణుంచి వచ్చింది? యివాళ డిస్మిస్ అవుతాడు తప్పక. అప్పుడూ ఇట్లాగే మాట్లాడుతాడా, వెనకవైపు కుక్క మొరుగు లేనా అని ఆలోచనలో పడ్డాడు గంగన్న. వెనకవైపు మాటలు మాత్రం గాకూడదు... అని మనసారా అనుకుంటూ కదలిపోతున్న కారులోంచి తన బాధను ధ్వనిస్తున్న సుబ్బన్నవైపు ప్రేమనిండిన కళ్ళతో చూశాడు గంగన్న. ●

(కథా బీజాన్ని యిచ్చిన ప్రియమిత్రుడు డి. నరసింహారెడ్డికి కృతజ్ఞతతో)

○ ఆగస్టు 1978, జనసుధ మాస పత్రిక

బెంగాలీ అనువాద ముద్రణ : అక్టోబరు 1985, చతురంగ,
సాహిత్య మాస పత్రిక, భారతీయ కథానికా సంకలన సంచిక